

ప్రయివేటు పాఠశాలల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని ఎంఇఒ స్వామి నాయక్ తెలిపారు. మండలంలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సీతానగరం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థులకు అన్ని వసతులను తప్పనిసరిగా పాటించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనను అందించాలని యాజమాన్యాలకు స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ఎపి పేపరు మిల్లులో సమ్మె సైరన్

ఏడేళ్లుగా నోచుకోని వేతన ఒప్పందం
పాలనా యంత్రాంగం ఆదేశాలు బేఖాతర్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఎపి పేపరు మిల్లులో మరోసారి సమ్మె సైరన్ మోగింది. వేతన ఒప్పందంపై యాజమాన్య నిరంకుశ వైఖరిని నిరసిస్తు కార్మికులు ఆందోళన చేపట్టారు. శనివారం నుంచి ప్రారంభమైన ఈ ఆందోళన నాలుగో రోజుకు చేరుకుంది. ఎపి పేపరు మిల్లు ఆవరణలోనే కార్మికులు శాంతియుతంగా ఆందోళనలు ప్రారంభించారు. తమ రోజువారీ పనులను నిలిపివేశారు. యాజమాన్యం మెయిన్ గేటు వద్ద పోలీసులను ఏర్పాటు చేసి రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులను సైతం లోనికి వెళ్లనీయకుండా అడ్డుకుంది. ఈ నేపథ్యంలో తాజాగా నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరి, కలెక్టర్ పి.ప్రశాంతి, రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణలను ఎపి పేపరుమిల్లు కార్మిక సంఘాలు కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. దీంతో బుధవారం ఉదయం మరో సారి కార్మికశాఖ అధికారులు యాజమాన్యంతో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ లక్ష్మీనారాయణ హాజరుకానున్నారు. జెసిఎల్ సమక్షంలో మంగళవారం యాజమాన్యం ప్రతినిధులు, కార్మిక సంఘాల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. జిల్లాలో భారీ పరిశ్రమల్లో ఒకటైన ఎపి పేపరు మిల్లులో కార్మిక చట్టాలకు గత కొన్నేళ్లుగా యథేచ్ఛగా తూట్లు పడుతున్నాయి.

పేపరుమిల్లులో 728 మంది పర్మినెంట్ కార్మికులు, సుమారు 2 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. 1972 నుంచి 2019 వరకు 14 వేతన ఒప్పందాలు జరిగాయి. కార్మికుల కష్టంతో ఫ్యాక్టరీ 1300 కోట్ల రూపాయల లాభాల్లో ఉన్నా యాజమాన్యం కార్మికుల డిమాండ్‌ను పట్టించు కోవడంలేదు.కార్మికుల డిమాండ్ ఆమోదిస్తే వేతనాల ద్వారా రూ.36 కోట్లు మాత్రమే అదనంగా చెల్లించాల్సి వస్తుంది. అయినప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు నూతన వేతన ఒప్పందంపై 11 కార్మిక సంఘాలు ఉద్యమిస్తున్నాయి.



తక్షణమే వేతన ఒప్పందం చేయాలి



ఎపి పేపరు మిల్లు యాజమాన్యం తక్షణమే పాత వేతన ఒప్పందం చేయాలి. అర్హులైన కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి.అదే విధంగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి. రిటైర్‌మెంట్ వయస్సు 60 సంవత్సరాలను కార్మికులందరికీ వర్తింపజేయాలి. కార్మికుల కష్టంతో లాభాల బాటలో ఉన్న పేపరుమిల్లు యాజమాన్యం అదే కార్మికులు వేతన ఒప్పందంలో మొండి వైఖరి అనుసరించడం దుర్మార్గం. తక్షణమే యాజమాన్యం దిగిరావాలి. సానుకూలంగా స్పందించాలి.

- టి.అరుణ్ , సిఐటియు ఉపాధ్యక్షులు రాజమహేంద్రవరం

చర్చలు పలు మార్లు విఫలం

పలు మార్లు యాజమాన్యంతో జరిపిన చర్చలు సైతం విఫలం అయ్యాయి. గతేడాది ఏప్రిల్‌లో 22 రోజులు పాటు కార్మికులు సమ్మె చేపట్టారు. ఆ సందర్భంగా అప్పటి కలెక్టరు మాధవీలత అధ్యక్షతన జరిగిన చర్చలలో వేతన ఒప్పందం చేస్తామని యాజమాన్య ప్రతినిధులు జవాబిచ్చారు. దీంతో కార్మికులు సమ్మె విరమించారు. అప్పటి నుంచి దశల వారీగా అనేక చర్చలు జరిగినా ఫలితం లేకపోయింది. 8 నెలల క్రితం కార్మికులు, అధికారులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మికశాఖ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. 11 కార్మిక సంఘాల ప్రతినిధులు మిల్లు కార్మికులకు రూ.10,500 వరకూ పెంచాలని డిమాండ్ చేశాయి. ఈ సమావేశానికి హాజరైన మిల్లు ఈడీ ముఖేష్ జైన్ కార్మికులకు రూ.3,250 పెంచుతామని చెప్పారు. అప్పుడు దీనిపై చర్చ జరగ్గా తదుపరి సమావేశానికి ఒక కొలిక్కి రావాలని నిర్ణయించారు అయితే డిసెంబరులో కలెక్టరేట్‌లో ఎంపి పురంధేశ్వరి, మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ ,అసిస్టెంట్ లేబర్ కమిషనర్ల సమక్షంలో మిల్లు కార్మిక సంఘాలు, యాజమాన్య ప్రతినిధులతో రెండో సారి సమావేశం నిర్వహించారు. ఎట్టకేలకు రూ.3,500 పెంచుతామని ప్రకటించారు. 8 నెలలు గడిచినా నేటికీ అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో మరో సారి సమ్మె సరైన్ మ్రోగింది.

యాజమాన్యం నిరంకుశ వైఖరి

జనవరి 7 2019న అప్పటి గుర్తింపు సంఘం 12(3) వేతన ఒప్పందంలో కార్మికుల రిటైర్మెంట్ 58 నుంచి 60 సంవత్సరముల పెంపునకు అంగీకరించారు. 2018 అక్టోబరు నుంచి అమలులోకివస్తుందని తెలిపారు. అయితే ఈ అగ్రిమెంట్‌కు విరుద్ధంగా కొత్తగా పర్మినెంట్ అయిన కార్మికులను 2025 జూన్ 30వ తేదీన 58 సంవత్సరములకే చట్టవిరుద్ధంగా కార్మికులనురిటైర్మెంట్ ఇచ్చారు. అదే విధంగా సెలవులకు, లాస్ ఆఫ్ పే కాలంలో అలవెన్సులు, వేతనం కోత విధించి అగ్రిమెంట్‌ను యాజమాన్యం ఉల్లంఘించింది. క్యాంటీన్‌లో భోజనం రూ1.50 నుంచి రూ15 చొప్పున, విద్యార్థులకు స్కూలు బస్సు ఫీజు రూ.50 నుంచి రూ.750 చొప్పున ఇష్టారీతిన పెంపు చేశారు. కార్మికుల క్వార్టర్లురిపేరుచేయకుండా ఏకపక్షంగా కూల్చివేతలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో కార్మికులు తాజాగా మరో సారి సమ్మె బాట పట్టారు.



మాట్లాడుతున్న కోదండరామ్

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సార్వత్రిక సమ్మెకు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. డివిజన్‌లో ఉన్న 20 శాఖా కార్యాలయాల్లోని క్లాస్ 3, 4 ఉద్యోగులు భోజన విరామ సమయంలో సార్వత్రిక సమ్మె సన్నాహక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కోదండరామ్, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి గనెయ్య, ఒబిసి ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శి రమేష్‌బాబు తదితరులు మాట్లాడారు. ఎల్ఐసిలో క్లాస్ 3, 4వ తరగతి ఉద్యోగుల హక్కులను కాపాడటంలో ఎఐఐఇఎ పోషించిన పాత్రను కొనియాడారు. పాలసీలపై జిఎస్‌టిను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ ఇన్సూరెన్స్, బ్యాంక్‌లను కాపాడాలని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వ్యవస్థలను రద్దు చేయాలన్నారు. ఎల్ఐసిలో ఖాళీగా ఉన్న క్లాస్ 3, 4 ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. 1995 పెన్షన్ పథకం ఎల్ఐసిలో ఉద్యోగులందరికీ వర్తింపు జేయాలన్నారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు ట్రేడ్ యూనియన్‌గా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాలలో పని చేస్తున్న ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.సత్యదేవ, జి.శ్రీనివాస్, వి.ఈశ్వరరావు, బి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, బాలు, అర్.శ్రీనివాస్, ప్రసాద్, జిలానీ, మహిళా కన్వీనర్ శిరీషతదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని ఫొటోగ్రాఫర్ల వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



వినతిపత్రం అందిస్తున్న ఫొటోగ్రాఫర్లు

బకాయిలు విడుదల చేయాలంటూ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు జెసికి వినతిపత్రం అందించారు. జిల్లా ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ మునిని బాబులు, అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, కార్యదర్శి ఫణికుమార్, కోశాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు మంగళవారం జెసిని కలిశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా తమకు ఇంకా డబ్బులు చెల్లించలేదన్నారు. దీనివల్ల తమ జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఎన్నికల సమయంలో రోజుకు 8 గంటల పనికి రూ.2,250 చొప్పున చెల్లిస్తామని నాడు జిఒను జారీ చేశారన్నారు. ప్రతి పది రోజులకు ఒకసారి డబ్బులు చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. జిల్లాలో మొత్తం 240 మంది వీడియోగ్రాఫర్లు ఎన్నికల్లో పనిచేశారని తెలిపారు. కొవ్వూరు, అనపర్తి, రాజమండ్రి అర్బన్ నియోజకవర్గాల వారికి పూర్తిగా డబ్బులు చెల్లించారని, మిగిలిన నాలుగు నియోజకవర్గాల వారికి బకాయిలు చెల్లించాల్సి ఉందని వివరించారు. ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించడం ద్వారా తమకు న్యాయం చేయాలని అసోసియేషన్ కోరారు.

వ్యాధులపై అప్రమతంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వర్షాకాలంలో నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉండ్రాజ వరం పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు, డాక్టర్ ఆర్.ఉషాదేవి సూచిం చారు. మంగళవారం పిహెచ్‌సి పరిధిలో డెంగీపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలన్నారు. జ్వరంతో బాధపడే వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రిలో చూపించుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రై డే- డ్రై డే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ కెడివిఎల్.కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.శ్రీరామమూర్తి, రత్నకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ బొమ్మూరులో నల్జాల్ మిత్రలో శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. న్యాక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ, న్యాక్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జె.రాజు, ఇన్‌ఛార్జి జయలక్ష్మి ట్రైనర్ డి.ఎస్.ఎన్ మూర్తి, ఎన్.రవిబాబు, కె.వి.కష్ణ సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పంచాయతీలో నీటి సరఫరా వ్యవస్థ నిర్వహించడం ద్వారా ఉపాధి పొందడానికి వీలుగా శిక్షణ ఇచ్చామన్నారు.

ఆర్‌జెడి కార్యాలయం ముట్టడి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కదం తొక్కి ఎస్‌కెఆర్ జూనియర్ కళాశాల విద్యార్థినులు
- ప్రినిపల్‌ను నియమించాలి, పాఠ్య పుస్తకాలు అందించాలని డిమాండ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రిన్సిపల్‌ను కేటాయించాలని, పాఠ్యపుస్తకాలను అందించాలంటూ శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి జూనియర్ మహిళా కళాశాల విద్యార్థినులు కదం తొక్కారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ ఆర్‌జెడి కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. తొలుత 450 మంది విద్యార్థినులు కళాశాల నుంచి ఆర్‌జెడి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. రెండు గంటల పాటు ఈ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా 2022లో ఈ కళాశాల ప్రభుత్వ పరమైందన్నారు. డిగ్రీ ఇంటర్ కంపోజిట్ కళాశాలగా ఉండేదన్నారు. జూనియర్ కళాశాలకు ప్రిన్సిపల్‌ని కేటాయించాలని, పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని, అధ్యాపకులను కేటాయించాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతూ వినతి పత్రాలు ఇచ్చినా అధికారులు నేటికీ పట్టించుకోలేదన్నారు. ఆర్ఐఒ నరసింహం, డివిఇఒతో మాట్లాడితే ఇది ప్రభుత్వ కళాశాల కాదని చెప్పారన్నారు. ప్రభుత్వ కాలేజీ కాకుండా ప్రయివేటు కాలేజీ కాకుండా ఫీజులు ఎలా కట్టించుకుంటున్నారని, పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారని వారు ప్రశ్నించారు. అనంతరం ఆర్‌జెడి, డిఇఒలకు వినతి పత్రాలు అందించారు. దీనిపై ఆర్‌జెడి మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.జ్యోతి, కనక, చైతన్య, సాహితి, సురేష్, జోసెఫ్, కార్తీక్, హేమంత్, సౌమ్య, మౌళి, లహరి, శివ బాలాజీ, తేజ, సాయి, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్‌జెడి కార్యాలయాన్ని ముట్టడించిన విద్యార్థినులు

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

ప్రజాశక్తి -కొవ్వూరు



అన్ని వర్గాల సంక్షేమం కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. మంగళవారం కాపవరం గ్రామంలో సూపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంచారు. పెనుమాక జయరాజు, సుంకర సత్తిబాబు, పెండ్యాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు ఈ సురేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం : రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కొవ్వూరుపాడు, కరగపాడు, సాగిపాడు, దొండపూడి, రాజంపాలెం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించారు. ఏడాదిలో చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి సత్యనారాయణ, కాకర్ల రామ తులసి, జగదీష్, ముత్యాల రాయుడు,కుచ్చి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ జక్కు సూర్యచంద్రం పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : ఎన్నికల ముందు చేసిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందనిఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు తెలిపారు. మంగళవారం పసలపూడిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, నాయకులు కె.సుబ్బారావు, ఇ.సత్యనారాయణ, వి.ప్రసాద్, ఎం.పాండురంగ, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో - కన్వీనర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

గోపాలపురం : మోటారును ఏర్పాటు చేసి గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపినట్టు పంచాయతీ కార్యదర్శి వి.అనురాధ తెలిపారు. గోపాలపురం శివారులో హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం రాత్రి భారీ గాలి దుమ్ముకు హై టెన్షన్ వైరు తెగి బోరు మోటర్ వైరుపై పడింది. దీంతో మోటారు కాలిపోయింది. అప్పటి నుంచి 1,2,3,4,5,10 వార్డులకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బందులు పడకుండా రెండు ట్యాంకర్లను ఏర్పాటు చేసి మూడు పూటల నీరు అందించామని తెలిపారు. కాలిపోయిన మోటార్ తొలగించి దాని స్థానంలో 15 హెచ్‌పి మోటర్‌ను రూ.70 వేలతో కొనుగోలు చేసి ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.

సత్యదేవ నర్సరీని సందర్శించిన మంత్రి పార్థసారథి



కడియం : రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం మండలంలోని కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత పుల్లా పెద్ద సత్యనారాయణ మొక్కనిచ్చి స్వాగతం పలికారు. నర్సరీలో పలు రకాల మొక్కలను ఆయన ఆసక్తిగా తిలకించారు. మొక్కల ప్రత్యేకతలను, పెంపకం తీరుతెన్నులను పెద సత్యనారా యణను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట కడియం తహశీల్దార్ సునీల్ కుమార్, ఎంపిడిఒ కె.రమేష్ ఉన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో వైఎస్ఆర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, వైసిపి పార్టీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు, రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. పలుచోట్ల రక్త దాన శిబిరాలను నిర్వహించారు.

రాజమహేంద్రవరం : వైఎస్ఆర్ జయంతిని వైసిపి రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, మాజీ ఎంఎల్ఎ రౌతు సూర్యప్రకాశరావు, డిసిసిబి మాజీ అధ్యక్షులు ఆకుల వీర్రాజు హాజరయ్యారు.

కొవ్వూరు : సంక్షేమ పథకాల ద్వారా పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయుడని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వైఎస్ఆర్ జయంతిని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకటరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంరద్భంగా లీటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో వైఎస్ఆర్ అభిమానులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. తలారి వెంకట్రావుతో పాటు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంటమనే రమేష్‌బాబు రక్తదానం చేశారు. తొలుత మెయిన్ రోడ్‌లో వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చిత్తూరు అన్నవరం, మండల అధ్యక్షుడు వెంపాటి సురేష్‌కుమార్, నాయకులు సుంకర సత్యనారాయణ, ఉప్పులూరి సూరిబాబు, గంధం శేష సాయి, నాయకులు పాల్గొన్నారు.



గోకవరంలో నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

గోపాలపురం : వైఎస్ఆర్ రాష్ట్ర ప్రజల గుండెల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటారని మాజీ హోం మంత్రి తానేటి వనిత అన్నారు. వైసిపి మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన వైఎస్ఆర్ జయంతిలో ఆమె పాల్గొని మాట్లాడారు. 250 మంది పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనా రాయణ, జడ్‌పిటిసి కాకులుపాటి లలిత, నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ యంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. మాజీ హోం మంత్రి తానేటి వనిత ఎర్నగూడెంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుట్టిన రోజు కేకును కట్ చేసి పంచారు.

నిడదవోలు : నిడదవోలులో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడవరపు భద్రం దొర అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. పేదలు, వికలాంగులు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు, పండ్లు, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకష్ణ, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ అగర్వాల్ హీరలాల్, పార్టీ మండల అధ్యక్షులు భావన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పాలకుర్తి ప్రభాకర్‌చౌదరి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బొనిగే రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. రిక్షా కార్మికులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. అలాగే వైసిపి మండల అధ్యక్షుడు మట్ట వెంకట్రావు ఆధ్వర్యంలో ఊనగట్లలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. మార్కొండపాడులో ఎంపిపి మట్ట వీరాస్వామి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు.

కడియం : కడియంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రైతులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆదర్శ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సతీష్‌చంద్రస్టాలిన్, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, అయినవిల్లి వెంకటేశ్వరావు,ఈలీ గోపాలం, కొత్తపల్లి శివాజీ, తోకల శీను, కుసునురి బాబులు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం : గోకవరం పాత బస్టాండ్ వద్ద వైఎస్ఆర్ జయంతిని ఎంపిపి సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గం సమన్వయకర్త తోట నరసింహం, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ పాల్గొన్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. తోట నరసింహ మాట్లాడుతూ వైఎస్ఆర్ హయాంలోనే జగ్గంపేట నియోజకవర్గంలో రెండు పంటల పండించేలా సాగునీరు అందిందన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు దాసరి చినబాబు, సుంకర రమణ, రాష్ట్ర పంచాయతీరాజ్ జాయింట్ సెక్రటరీ సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, నరాల శెట్టి నరసయ్య, మడికి మైనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో రక్తదానం చేస్తున్న వైసిపి నాయకులు

తాళ్లపూడి : అన్నదేవరపేటలో నిర్వహించిన వైఎస్ఆర్ జయంతిలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు పాల్గొన్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మేణి బ్రదర్స్ ఆర్థిక సాయంతో 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వైసిపి మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు జిల్లా ఉపాధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, గజ్జరం సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు పాల్గొన్నారు. గజ్జరంలో సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, పెద్దేవంలో సర్పంచ్ టి.వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, మలకపల్లిలో కుంటముక్కల కేశవ నారాయణ, తాళ్లపూడిలో ఒంబోలు పోసి బాబు, సిద్ధంశెట్టి కష్ణ, వేగేశ్వరపురంలో సూలాపోసియ్య, కొమ్మిరెడ్డి నారాయణ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

బైకుల చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో రెండు ప్రాంతాల్లో రెండు బైకులు చోరీకి గురైన ఘటనపై మంగళవారం కేసులు నమోదయ్యాయి. పట్టణంలో ఇందిరమ్మ కాలనీకి చెందిన గోడా సుందర్ సింగ్ అనే వ్యక్తి 15 రోజుల క్రితం మోటార్ సైకిల్ ఇంటిదగ్గర పార్కింగ్ చేసి విజయవాడ బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి మోటార్ సైకిల్ చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. సుందర్ సింగ్ ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అవంతి ఫీట్స్ ఫ్యాక్టరీ గేటు ఎదురుగా ఉన్న ప్రాంతంలో బొల్లా కనకదుర్గ ప్రసాద్ అనే వ్యక్తి మోటార్ సైకిల్ సోమవారం రాత్రి చోరీకి గురైంది. ఇంటి బయట పార్కింగ్ చేసిన మోటార్ సైకిల్ తెల్లవారు లేసి చూసేసరికి కనిపించడం లేదని బాధితుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో 13వ వార్డుకు చెందిన చింతా సూర్యనారాయణ ఈనెల మూడో తేదీ నుంచి కనిపించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో సూర్య నారాయణ హైదరాబాదులో చికిత్స పొందుతున్నట్లు అతని సోదరి లావేటి రమణ తెలిపారు. మూడో తేదీ ఉదయం రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని రమణ మంగళవారం ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసినవారు 9440796622కు సమాచారం ఇవ్వాలన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

జూన్ 28వ తేదీ రాత్రి కొవ్వూరు పట్టణ శివారున కృష్ణారావు చెరువు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ ఎం.దుర్గారావు తెలిపారు. విఆర్ఓ కుందేటి మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్నిరాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. మృతుడు బిచ్చగాడిగా భావిస్తున్నట్లు తెలిపారు. అతని వివరాలు లభ్యం కాలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి -భర్త, ఇద్దరు పిల్లలకు గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, ఆమె భర్త, ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఇంజరం గ్రామానికి చెందిన దడాల చంద్రశేఖర్ భార్య, ఇద్దరు చిన్నారులతో మోటారు సైకిల్‌పై కాకినాడ ఆసుపత్రికి బయలుదేరారు. పటవల వచ్చే సమయానికి వెనక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీ కొట్టడంతో భార్య దడాల ఝాన్సీరాణి(28) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త చంద్రశేఖర్ పెద్ద కుమారుడు అభినవ్ దీక్షిత్, ఐదు నెలల రెండో కుమారునికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన ముగ్గురిని 108లో కాకినాడ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. కోరంగి పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. కోరంగి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ పరిధిలోని కుమ్మర వీధిలో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం జరిగిన ఈ దాడిలో గుబ్బల వీరఆదివిష్ణును సారాతో అరెస్ట్ చేసినట్లు సిఐ రామ్మోహనరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడుల్లో కాకినాడ నార్త్ ఎస్ఐ ఎంవిబి.కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

11 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం సర్కిల్ పోలీసులు దాడి చేసి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. సిఐట టి.గణేష్ తెలిపిన వివరాల మేరకు కడియం సిఐ వెంకటేశ్వరరావు, ధవళేశ్వరం ఎస్ఐ హరిబాబు, ఈగల్ టీమ్‌తో కలిసి ఈ ఆపరేషన్ నిర్వహించామని సిఐ గణేష్ తెలిపారు. ధవళేశ్వరంలోని స్థానిక పివిఆర్ లే-అవుట్‌లో కొంతమంది వ్యక్తులు పెద్ద మొత్తంలో గంజాయిని కలిగి ఉన్నారనే సమాచారంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. వెంటనే బృందాలుగా ఏర్పడి దాడి చేసి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. గంజాయి వంటి నిషేధిత పదార్థాల విక్రయం, రవాణా చట్టరీత్యా నేరమని, అలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇరువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో శ్రీనివాసపురం పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. రాజమహేంద్రవరం వైపు వెళు న్న ఆటోను వెనుక వస్తున్న బివిసి కళాశాల బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తాళ్లపూడికి చెందిన ఆటో డ్రైవర్ టి.నాగరాజు, ఆటోల ప్రయాణిస్తున్న కొంపల్లి రాంబాబు తీవ్రంగా గాయపడ్డారు. రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండలంలోని తూరంగి గ్రామంలోని ఒక ఇంటిలో నిల్వ చేసిన 11,335 కేజీల పిడిఎస్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సామర్లకోట మండలం వికె.రాయపురం గ్రామానికి చెందిన అమలకోట వరహాలు, తలారి వీరబాబులకు చెందిన బియ్యంగా అధికారులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యల కోసం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసినట్లు సివిల్ సప్లయి డిటి మద్రి వీరాస్వామి తెలిపారు.

బిఎల్ఒలకు నేటి నుంచి శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

భారత ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలెక్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 17వరకూ బూత్ లెవెల్ అధికారులు(బిఎల్ఒ)కు శిక్షణను నిర్వహించనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మొత్తం 1,581 మంది బిఎల్ఒలు ఈ శిక్షణలో పాల్గొంటారని తెలిపారు. 6 బ్యాచులుగా శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ కోసం బూత్ లెవెల్ అధికారులతో పాటు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు తప్పని సరిగా హాజరుకావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ బూత్ లెవెల్ స్థాయి సిబ్బందికి ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. అనపర్తిలో 228, రాజానగరంలో 216 , రాజమహేంద్రవరం రూరల్‌లో 241, రాజమహేంద్రవరం సిటీలో 176, కొవ్వూరులో 205, నిడదవోలులో 246, గోపాల పురంలో 269 మంది బిఎల్ఒలు ఈ శిక్షణలో పాల్గొంటారని తెలిపారు. 9న రాజమండ్రి రూరల్‌లో 44, అర్బన్‌లో 60 మందికి, 10న అనపర్తిలో 46, రాజానగరంలో 43, రాజమండ్రి అర్బన్‌లో 50, రాజమండ్రి రూరల్‌లో 44, కొవ్వూరులో 45 , గోపాలపురంలో 50 మంది బిఎల్ఒలకు, 11న అనపర్తి 46, రాజానగరం 43 , రాజమండ్రి అర్బన్ 50, రాజమండ్రి గ్రామీణం 44, కొవ్వూరు 45, నిడదవోలు 41, గోపాలపురం 50 మందికి, 14న రాజానగరం 43, నిడదవోలు 41మందికి, 15న అనపర్తి 46, రాజానగరం 43, రాజమండ్రి అర్బన్ 50, రాజమండ్రి గ్రామీణం 45, కొవ్వూరు 45, నిడదవోలు 41, గోపాలపురం 50 మందికి, 16న అనపర్తి 46, రాజానగరం 44, రాజమండ్రి అర్బన్ 41, రాజమండ్రి గ్రామీణం 45, కొవ్వూరు 41, నిడదవోలు 41, గోపాలపురం 50 మందికి, 17న అనపర్తి 44, రాజమండ్రి గ్రామీణం 45, నిడదవోలు 41, గోపాలపురం 48 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

యానాం వార్తలు

కంచర్ల కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - యానాం

యానాం బస్ కాంప్లెక్స్ రోడ్డులోని కంచర్ల కాంప్లెక్స్‌లో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కాంప్లెక్స్‌లోని ఎస్‌బిఐ ఎటిఎం సెంటర్, మోటారు మెకానిక్ షెడ్ ఎదురుగా ఉన్న కారుతోపాటు, 2 మోటారు సైకిళ్ళు దగ్ధమయ్యాయి. మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. తొలత ఎటిఎం నుంచే మంటలు వ్యాపించినట్లు స్థానికులు తెలిపారు. ఈ మంటలు మోటారు షెడ్ ఎదురుగా ఉన్న వాహనాలకు వ్యాపించాయి. స్థానిక ఫైర్ స్టేషన్‌కు అందిన సమాచారంతో సిబ్బంది హుటాహుటీనా సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఎటిఎం సెంటర్‌తోపాటు, కారు, రెండు మోటారు సైకిళ్ళు పూర్తిగా దగ్ధం అయ్యాయని స్థానిక ఫైర్ స్టేషన్ ఎస్ఐ జె.మీరాసాహెబ్ తెలిపారు. అగ్ని ప్రమాదం విద్యుధాఘాతం వల్ల జరిగిందా? లేక మరేయితర కారణమా? అనేది తెలియాల్సివుంది. ఈ ప్రమాదంలో ఎటిఎం మిషన్‌లోని నగదు కాకుండా సుమారు రూ.5 లక్షలు ఆస్తినష్టం ఉంటుందని ఫైర్ అధికారులు అంచనా వేశారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి - యానాం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యానాం నల్లచెరువు సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, ఎస్ఐ కట్టా సుబ్బరాజు, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధాని దినేష్, నాయకులు కాటంశెట్టి రామూర్తి మాట్లాడారు.

ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి దత్తత స్వీకరించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రతి ఉద్యోగి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి సూచించారు. మంగళవారం మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో గుర్తించిన శాంతా నాగదుర్గ కుటుంబాన్ని సందర్శించారు. ఆ కుటుంబ సభ్యులతో ఏకాంతంగా సమావేశమై వారి అవసరాలు, ప్రస్తుత కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న ఇంటింటికీ కుళాయి, విద్యుత్తు కనెక్షన్లు, దీపం 2, రేషన్ సరుకులు, సామాజిక ఫించను సక్రమంగా అందుతున్నాయా, తల్లికి వందనం, విద్యార్థి మిత్ర కిట్లు, తదితర సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం పి-4ను ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో 1.02 లక్షల కుటుంబాలను పి-4 ద్వారా అభివృద్ధి చేసేందుకు గుర్తించడం జరిగిందన్నారు. అట్టడుగున ఉన్న కుటుంబాలకు సంపన్న కుటుంబాలు సాయం అందించడమే పి-4 లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్‌డిఒ కె.శ్రీరమణి, జిల్లా ప్రణాళిక అధికారి పి.త్రినాథ్, బిసి కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, తహశీల్దార్ జెవిఆర్. రమేష్, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, పంచాయితీ కార్యదర్శి గణేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న జోనల్ స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా జరుగుతున్నాయి. మంగళవారం బాలుర అండర్ 14 ఫుట్ బాల్ గేమ్‌ను నిర్వహించారు. ఈ పోటీలో ఎంజిజి బాయ్స్ హైస్కూల్ విన్నర్‌గానూ, ఆర్‌జిజి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ రన్నర్‌గా నిలిచింది. మూడో స్థానంలో డాక్టర్ కెఆర్.నారాయణన్ గవర్నమెంట్ హైస్కూల్ నిలిచింది. విజేత జట్లుకు వ్యాయామ ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, ఐవికె.మోహన్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజానికి మొక్కలు దోహదం

ప్రజాశక్తి - కిర్లంపూడి

కాలుష్య రహిత సమాజానికి మొక్కలు ఎంతగానో దోహదపడతాయని కిర్లంపూడి మండలం ఎంపిపి తోట రవి అన్నారు. మంగళవారం కిర్లంపూడి కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి తోట గాంధీ, ఎస్ఎంసి ఛైర్మన్ ఆళ్ల బాబులు, ఎంపిడిఒ బావిశెట్టి హరికృష్ణ పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల పొలం బడి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో మంగళవారం పలుచోట్ల పొలం బడి కార్యక్రమాలను నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వంటి వాటిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణ, సాగునీటి యాజమాన్యం తదితర అంశాలను వివరించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేశారు.

కొవ్వూరు : ఖరీఫ్ సాగులో సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలని వ్యవసాయ శాఖ ఎడి సిహెచ్.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం కొవ్వూరులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. నారుమడి యాజమాన్యం, విత్తన శుద్ధి విధానం పై రైతులకు వివరించారు. ఖరీఫ్ దుక్కుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఎ.గంగాధర్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : వ్యవసాయంలో రైతును శాస్త్రవేత్తగా మార్చడమే పొలం బడి ఉద్దేశమనికొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకులు చింతల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మోర్త, ఉండ్రాజవరంలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పొలం బడి ద్వారా రైతులకు పలు సలహాలు, సూచనలు ఇస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. అరటి సాగు చేసే రైతులు ఈనెల 15లోగా ఎకరాకు రూ.3,026, వరి సాగు చేసే రైతులు ఎకరాకు రూ.580 ఆగస్టు 31లోగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ప్రీమియంను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు శశి, గీత, ప్రకతి వ్యవసాయ సిబ్బంది కాశీ పాల్గొన్నారు.

చాగల్లు : మండలంలో మల్లవరం, గౌరిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి కె.వేణుగోపాలకృష్ణ మాట్లాడారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు.కాంప్లెక్స్ ఎరువులను పంట ఆకారి దమ్ములో లేదా వరి వూడ్చిన వారం రోజుల్లోపు మాత్రమే వేసుకోవాలన్నారు. తరువాత జింక్ సల్ఫేట్ 21శాతం ఎకరానికి 20 కేజీలు వాడుకోవాలన్నారు. జింక్ వాడకానికి సూపర్ వాడకానికి మధ్య 48 గంటల వ్యత్యాసం ఉండాలన్నారు. అనంతరం కలుపు యాజమాన్యం కోసం వివరించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం పొందేందుకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎం.వెంకటరావు, ఎం.నాగేశ్వరరావు, ఎంశ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్.శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు కె.రాజేష్, డి.రాజ్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.

వార్షిక కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వార్షిక సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను తయారు చేసేందుకు మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపిడిఒ వివివిఎస్.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఎఎన్ఎంలకు శిక్షణా కార్యక్రమము నిర్వహిస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ శిక్షణ ఉంటుందన్నారు.

పలువురికి టిబి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైద్య సేవల యూనిట్ పరిధిలోని అపర్ణ టైల్స్ ఇండస్ట్రీస్ కార్మికులకు మంగళవారం టిబి వ్యాధి గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. తొలుత కార్మికులకు టిబి వ్యాధిపై అవగాహన కల్పించారు. టిబిని సకాలంలో గుర్తించి వైద్య సేవలు పొందితే పూర్తిస్థాయిలో నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి ఆఫీసర్ డాక్టర్ ఐ.ప్రభాకర్, ఇఎస్ఐసి డాక్టర్లు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.వెంకటేష్, డాట్ ప్లస్ సూపర్‌వైజర్ ఆర్.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ ఛైర్మన్ బుదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నాయకులు మొగిలి గంగాధర్, గోన శివ, మాధరపు వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరావు, సూరపురెడ్డి నరేష్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక పిహెచ్‌సి వైద్యుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, జ్వరాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా దోమకాటు, వ్యాధుల నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత, జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సునీతమెర్సీ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దరి చేరవన్నారు. ఆయా వ్యాధులు ప్రభలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు భాషా, రజిమ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్స్, టీచర్స్ డే

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 10 వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి లోని 80 ప్రభుత్వ, 38 ప్రయివేటు పాఠశాలల్లో ఈ వేడుకలు జరుగుతా యన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రగతి, విద్యార్థుల విద్యాభివృద్ధి తదితర అంశాల సమీక్షిస్తారని ఆయన తెలిపారు.